

## గొర్రెల కాపరుల కుటుంబాలకు అండగా గంట రాములు

- పిడుగుపాటు బాధితులకు

ఆర్థిక సాయం

02


# ప్రజాజ్యోతి

కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:13





# ఆ ల్యాప్‌టాప్ ఎట్టకేలకు డిపిఓ కార్యాలయానికి..!

- ప్రజా జ్యోతి కథనానికి అధికారుల స్పందన
- రిటైర్డ్ డీపీఓ వద్ద నుంచి డీపీఓ కార్యాలయానికి చేరిన ప్రభుత్వ ల్యాప్‌టాప్

- దొమ్మటి రాజేష్

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** "ఆ ల్యాప్‌టాప్ ఎక్కడ..!?" అంటూ ప్రజా జ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి అధికారులు స్పందించారు. ప్రభుత్వ విధుల కోసం పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి కేటాయించిన ల్యాప్‌టాప్ ఎట్టకేలకు తిరిగి కార్యాలయానికి చేరింది. రిటైర్డ్ డీపీఓ వీరబుచ్చయ్య తన వెంట తీసుకెళ్లిన ల్యాప్‌టాప్‌ను గురువారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అప్పగించినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

మిగతా 2 లో



# బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం

- అక్షిత రాణి కుటుంబాన్ని పరామర్శించిన. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు : ప్రభుత్వ విప్ విజయరమణారావు
- బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం హామీ

**సుల్తానాబాద్, సెప్టెంబరు 24 (ప్రజా జ్యోతి):** రేగడి మద్దికుంటలో ఇంజనీరింగ్ విద్యార్థిని అక్షిత రాణి మృతికి కారణమైన నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం రేగడి మద్దికుంటకు చేరుకున్న మంత్రి.. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాగూర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూతో కలిసి అమృతరాణి తల్లిదండ్రులు ఇసాక్, రజితలను పరామర్శించి ఓదార్చారు.

మిగతా 2 లో

# చేయూత దరఖాస్తుల పరిశీలన వేగవంతం


**ధర్మారం,సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):**

ధర్మారం మండలంలో చేయూత పథకం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగం పుంజుకుంది.ఇందులో భాగంగా గురువారం కొత్తూరు గ్రామంలో ఎంపీడీవో వేముల సుమలత క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించారు.దరఖాస్తుదారుల అర్హతలు,కుటుంబ వివరాలు,ఇతర అంశాలపై ఆరా తీశారు.నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.ఎలాంటి అనర్హతకు తావులేకుండా వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య సంగీత ఆంజనేయులు, ఉప సర్పంచ్ సామల నాగభూషణం, కార్యదర్శి కవిత,వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఆ ల్యాప్‌టాప్ ఎట్టకేలకు డిపిఓ కార్యాలయానికి..!

మొదటిపేజీ తరువాయి




**ప్రజా జ్యోతి కథనంతో కదిలిన వ్యవహారం..!**

జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి కేటాయించిన ల్యాప్‌టాప్ కార్యాలయంలో లేకపోవడం, రిటైర్డ్ అధికారి వద్ద ఉండటం, తిరిగి అప్పగించాల్సిందిగా కోరినా "గిఫ్ట్‌గా వచ్చింది" అని చెప్పినట్లు అధికారులు వెల్లడించడం వంటి అంశాలతో ప్రజా జ్యోతి ఈ నెల 23న "ఆ ల్యాప్‌టాప్ ఎక్కడ..!?" అనే శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన పరికరం పదవీ విరమణ అనంతరం కూడా కార్యాలయానికి చేరకపోవడంపై కథనంలో ప్రశ్నలు లేవనెత్తింది.ప్రజా జ్యోతి కథనం వెలువడిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టడంతో రిటైర్డ్ డీపీఓ వీరబుచ్చయ్య వద్ద ఉన్న ల్యాప్‌టాప్ తిరిగి కార్యాలయానికి చేరినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ల్యాప్‌టాప్‌ను అందజేసినట్లు తెలిపారు.

**కార్యాలయానికి మళ్లీ అందుబాటులోకి..**

ప్రభుత్వ విధుల నిర్వహణలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లు, ఆన్‌లైన్ నివేదికలు, ఈ-పంచాయతీ, ఈ-గ్రామస్వరాజ్ తదితర అధికారిక కార్యకలాపాల పర్యవేక్షణకు ఉపయోగపడే ల్యాప్‌టాప్ తిరిగి కార్యాలయానికి చేరడంతో సిబ్బందికి అందుబాటులోకి వచ్చింది. ల్యాప్‌టాప్ తిరిగి వచ్చిన విషయాన్ని ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి శ్రీమాల ధ్రువీకరించారు.ప్రజా సమస్యలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగం, అధికారిక వ్యవహారాలపై ప్రజా జ్యోతి ప్రచురించే కథనాలకు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ చదువుతున్న అక్షిత రాణి సింగరేణిలో ఎంట్రన్స్‌షిప్ చేస్తున్న సమయంలో ఈ నెల 13న ఇద్దరు వ్యక్తులు పురుగుల మందు తాగించి హత్య చేసిన ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. ఘటనపై పోలీసులు వేగంగా స్పందించి 24 గంటల్లో నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. కేసులో సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి, పటిష్ఠమైన ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సీపీ అంబర్ కిషోర్ ఝూను ఆదేశించారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.4.12 లక్షల పరిహారం అందిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ.4.12 లక్షలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేదలు, దళితులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగంప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ అక్షిత రాణి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**మహిళలపై దాడులను ఉపేక్షించం**

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ సింగరేణిలో దళితులపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పలువురు నాయకులు, అధికారులు హాజరు**

కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య,



సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ వినుపాల ప్రకాష్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సర్పంచ్ బోయిని లావణ్య శ్రీనివాస్, బాధిత కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ పొన్నమనేని రంజిత్‌రావు ఆధ్వర్యంలో ఎస్సై చంద్రకుమార్ బందోబస్తు నిర్వహించారు.

# గొర్రెల కాపరుల కుటుంబాలకు అండగా గంట రాములు- పిడుగుపాటు బాధితులకు ఆర్థిక సాయం

మొదటిపేజీ తరువాయి

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:**

ములసాల గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు 25 గొర్రెలు మృతి చెందిన ఘటనలో బాధిత గొర్రెల కాపుల కుటుంబాలను యాదవ సంఘం నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన గంట రాములు యాదవ్ ఇద్దరు కుటుంబాలకు చెరో రూ.25 వేల చొప్పున మొత్తం రూ.50 వేల ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు.గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఒక్కసారిగా 25 గొర్రెలు మృతి చెందడం తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన యాదవ సంఘం నాయకులు తమవంతు సహాయం అందించారు. సందానవేన రాజేందర్, మేకల మల్లేశం, పెగడ రమేష్ యాదవ్ రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని నాయకులు తెలిపారు. పిడుగుపాటు వంటి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన గొర్రెల కాపులను ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత మహాసభ జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం, జనరల్ సెక్రటరీ సందానవేన రాజేందర్, ప్రధాన కార్యదర్శి పెగడ రమేష్ యాదవ్, సర్పంచులు పోలు రాజు యాదవ్, మద్దేవేని రవి యాదవ్, అరుకుటి ఫకీర్ యాదవ్, వేలుపుల ఐలయ్య, సదయ్య యాదవ్, గ్రామ ఉపసర్పంచ్ అశోక్, దాసరి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



# టీకే రమేష్ మృతదేహానికి ప్రముఖుల నివాళి

**సుల్తానాబాద్, సెప్టెంబరు 24 (ప్రజా జ్యోతి):**





సుల్తానాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు, సిటీ కేబుల్ రిపోర్టర్ టీకే రమేష్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. గురువారం ఆయన మృతదేహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రమేష్ సుమారు 20 ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన మృతి జర్నలిస్టు లోకానికి, సుల్తానాబాద్ ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు., ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ రమేష్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొనియాడారు. రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పాత్రికేయులు, అధికారులు మిత్రులు, అభిమానులు పాల్గొని రమేష్‌కు నివాళులర్పించారు.

# సిరిసిల్లలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

## అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు:

## ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి మీడిదొడ్డి భానుకుమార్

**ముస్తాబాద్, సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి):**

సిరిసిల్లలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు: ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి మీడిదొడ్డి భానుకుమార్సిరిసిల్ల జిల్లాలో విద్యారంగ చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయమని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి మీడిదొడ్డి భానుకుమార్ అన్నారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా సిరిసిల్లలో రూ.200 కోట్లతో పాఠశాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల ఏర్పాటుతో సిరిసిల్ల పరిసర ప్రాంతాల్లోని వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, క్రీడా సౌకర్యాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని భానుకుమార్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో విద్యను అభ్యసించేందుకు ఈ పాఠశాల ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సిరిసిల్లకు ఇంతటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థను మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కే.కే. మహేందర్ రెడ్డిలకు విద్యార్థులు, యువజనుల పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సిరిసిల్ల ప్రజలు ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక





విద్యాసంస్థ కల సాకారం కావడం సంతోషకరమని, ఈ నిర్ణయం జిల్లాలో విద్యాభివృద్ధికి మరింత ఊతమిస్తుందని మీడిదొడ్డి భానుకుమార్ అన్నారు.

# సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ తనిఖీ

**సుల్తానాబాద్, సెప్టెంబరు 24 (ప్రజా జ్యోతి):**

సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధులు, కేసులు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్‌పై ఆరా తీశారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. 5ఎస్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ స్టేషన్‌ను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్ వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అనంతరం సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన సీపీ.. మరిన్ని ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటుకు ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ రంజిత్‌రావు, ఎస్ఐ చంద్రకుమార్ తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ధర్మారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకుని పరామర్శ

## మృతుని కుటుంబానికి సానుభూతి తెలిపిన ఏనుగు మనోహర్ రెడ్డి

**కోనరావుపేట,సెప్టెంబర్.23 (ప్రజాజ్యోతి)**

జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన నూనె బాలయ్య ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ గురువారం రోజున వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాగుల రాజు, జక్కుల నాగరాజు యాదవ్, పొన్నం పరశురాం గౌడ్ ,సిద్ధంశెట్టి శ్రీనివాస్,కొమ్ము ఎల్లయ్య యాదవ్, పొట్లపల్లి గోపాలరావు, గంగుల ప్రశాంత్ యాదవ్, శ్రీరాముల బాబు, మంకు అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శ్రీ దీక్షిత ఎంపిక

**ధర్మారం, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):**

ధర్మారం మండల కేంద్రంలోని సాయి మణికంఠ మోడ్రన్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని టి.శ్రీ దీక్షిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 20న కోరుట్లలోని మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-16 విభాగంలో 60 మీటర్ల రన్నింగ్ రేసులో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది.ఈ నెల 26, 27 తేదీల్లో హనుమకొండలోని జె.ఎన్.ఎస్. స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి 12వ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీ దీక్షిత పాల్గొననుంది.విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి, పీఈటీ సాయి కుమార్‌తో పాటు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి శ్రీ దీక్షితను అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## ఆయిల్‌పామ్ సాగుకు ఇదే అనుకూల సమయం
## ఎఫ్ఎఫ్‌బీ ధర రూ.24,025..
## రైతులకు ప్రోత్సాహకరంగా ప్రభుత్వ సహాయం

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి:**



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ తాజా పండ్ల గెలల ధర మెట్రిక్ టన్నుకు రూ.24,025గా ఉందని, ఇది రైతులకు ప్రోత్సాహకరమైన ధర అని తెలిపారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో విజయవంతంగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల తోటలను ఇతర రైతులు సందర్శించి వారి అనుభవాలను తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో దిగుబడులు, మార్కెటింగ్, పంట నిర్వహణ, ప్రభుత్వ సహాయం తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో మరింత నమ్మకం కలుగుతుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు మొక్కల సరఫరా, నాలుగు సంవత్సరాల పాటు తోట నిర్వహణ, అంతర పంటలకు ఆర్థిక సహాయం, బిందు సేద్యంపై ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉందని వెల్లడించారు. అయితే రైతులు తప్పనిసరిగా ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమైన భూమితో పాటు నిరంతర నీటి వసతి ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.చిన్న, సన్నకారు రైతులు, మహిళా రైతులు, సాగుకు అనుకూలమైన భూమి కలిగిన రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులకు భూమి అనుకూలత, నీటి వసతి, సాగు విధానం, ప్రభుత్వ సహాయం, మార్కెటింగ్ తదితర అంశాలపై ఉద్యానశాఖ అధికారులు పూర్తి సమాచారం అందిస్తారని పేర్కొన్నారు.ప్రస్తుతం ఉన్న ప్రోత్సాహకరమైన ఎఫ్ఎఫ్‌బీ ధర, ప్రభుత్వ సహాయం, నీటి వినియోగ సామర్థ్యం, ఇప్పటికే విజయవంతంగా సాగు చేస్తున్న రైతుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అనుకూలమైన భూమి, నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగును పరిశీలించాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు.ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు తమ పరిధిలోని ఉద్యాన విస్తరణ అధికారులు, ఉద్యాన అధికారులు, ఆయిల్‌పామ్ క్షేత్ర సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు.

## కోనరావుపేటలో "స్వచ్ఛత హీ సేవా - 2026" కార్యక్రమం
## వ్యాపారులకు, విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన.. సర్పంచ్ కాశీరాం పిలుపు

**కోనరావుపేట,సెప్టెంబర్.24 (ప్రజాజ్యోతి)**

స్వచ్ఛత హీ సేవా - 2026 17-09 నుండి 02-10 కార్యక్రమంలో భాగంగా కోనరావుపేట మండల కేంద్రంలో గురువారం రోజున విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ మస్కూరి కాశీరాం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు గ్రామంలోని దుకాణాలను సందర్శించారు. ఘన వ్యర్థాల నిర్వహణ - 2026 నియమాల ప్రకారం నాలుగు రకాల చెత్త బుట్టల వాడకం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచిస్తూ నోటీసులు జారీ చేశారు.అనంతరం ఉపాధి హామీ కూలీలకు, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేసి వేయడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మస్కూరి కాశీరాం మాట్లాడుతూ.. కోనరావుపేటను స్వచ్ఛ గ్రామంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలంటే ప్రజలందరి సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశీరాం, పాలకవర్గ సభ్యులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి గ్రామ పంచాయతీ అండ

### పల్లిమక్తలో మృతురాలి కుటుంబానికి బియ్యం, నగదు సహాయం

**కోనరావుపేట,సెప్టెంబర్.23 (ప్రజాజ్యోతి)**



కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో మానవత్వం చాటుకునే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 3వ వార్డు సభ్యులు మొకెనపల్లి బాలరాజు తల్లి ఎల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్ పరామర్శించారు.పాలకవర్గ సభ్యులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యం.వెయ్యి రూపాయలు నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలు ఎల్లవ్వ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో పంచాయతీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, జీపీవో కనకయ్య, వార్డు సభ్యులు జాగిరి కిరణ్ గౌడ్, ఛిద్రవేణి నరేష్, జిన్న సమత అర్జున్, రేగుల పద్మ పరశరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేములవాడలో కొనసాగుతున్న శోభాయాత్ర..

**వేములవాడ,సెప్టెంబర్,24:ప్రజాజ్యోతి.**



వేములవాడ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర గురువారం మధ్యాహ్నం కుడా కొన సాగుతోంది. బుధవారంతో నవరాత్రి ఉత్సవాలు



ముగిసినప్పటికీ, రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా పలు మండపాల వద్ద విగ్రహాల కదలిక నిలిచిపోయింది. దీంతో నిర్దేశిత సమయానికి నిమజ్జన ప్రక్రియ పూర్తి కాలేదు. మధ్యాహ్నమైనా శోభాయాత్రలు కొనసాగుతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, నిమజ్జన ప్రక్రియ త్వరితగతిన ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా చూసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

# వేములవాడలో వర్షాలతో వాయిదా పడ్డ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

## తదుపరి అక్టోబర్ 1 నుంచి 4 వరకు నిర్వహణ..

## 33 జిల్లాల జట్లకు సమాచారం అందించిన నిర్వాహకులు





**వేములవాడ,సెప్టెంబర్,24:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 29 వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తలపెట్టిన రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, తుపాను ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కబడ్డీ సంఘం ప్రతినిధులు, నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ... ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, ఆధ్వర్యంలో ఈ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశామని తెలిపారు. మైదానం ప్రాంగణం, క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు సహా సర్వం సిద్ధం చేసినప్పటికీ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల క్రీడా ప్రాంగణం బురదమయంగా మారిందని పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల క్రీడాకారులు గాయపడే ప్రమాదం ఉందని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పోటీలను వాయిదా వేస్తున్నట్లు వివరించారు.రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అనుమతితో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచనల మేరకు, మళ్లీ ఈ పోటీలను అక్టోబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు వేములవాడలోనే నిర్వహించాలని రీషెడ్యూల్ చేసినట్లు ప్రకటించారు. పోటీల తేదీల మార్పు సమాచారాన్ని ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని 33 జిల్లాల కబడ్డీ అసోసియేషన్లకు, ఆయా జిల్లాల జట్లకు చేరవేసినట్లు స్పష్టం చేశారు. అక్టోబర్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్‌ను క్రీడాభిమానులు మెచ్చే రీతిలో, మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఘనంగా, విజయవంతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంపత్ రావు రాష్ట్రకబడ్డీ సంఘంఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ముస్కు మల్లారెడ్డి, కార్యదర్శి సింగారపు తిరుపతి, కబడ్డీ అడ్వైసర్ నాగుల లక్ష్మి నారాయణ, జాయింట్ కార్యదర్శి సోమినేని బాలు, పొత్తూరి నరేష్ బండారి సాయి తదితరులు పాల్గొన్నారు..

# బాపూజీ బాటలో చేనేతకు బలమైన బాట

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

## వేడుకలకు ఘన ఏర్పాట్లు

**వీణవంక , సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి)**

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈ నెల 27న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు వీణవంక మండలం వాల్బపూర్ గ్రామానికి చెందిన ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, పద్మశాలి సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు గూడూరు శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు గాదె గుణసాగర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలు, చేనేత రంగం అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అందించిన సేవలను స్మరించుకోనున్నారు. "చేనేత బలమే తెలంగాణ బలం చేనేత వృత్తిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుణసాగర్ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి చేనేత, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, బీసీ సంఘాల నాయకులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు అర్పించేందుకు చేనేత, బీసీ, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు



అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ ఫౌండేషన్ తరపున గాదె గుణసాగర్ పిలుపునిచ్చారు.

# స్థానిక భీమేశ్వర ఆలయం వద్ద 150 మంది భక్తులకు అన్నదానం

**వేములవాడ,సెప్టెంబర్,24:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణం లో మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యం లో దాతల సహకారంతో 19 93 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భా గంగా గురువారం రోజున స్థా నిక భీమేశ్వర ఆలయం వద్ద 150 మంది పేదలకు, భక్తులకు అన్నదాన నిర్వహించడం జరి గిందని మధుమహేష్అన్నారు..నేటి అన్నాదాతలుగా ముంబై వాస్తవ్యులు నడిమెట్ల ఎల్లప్ప భారతి దంపతులు అ న్నదానం చేశారు.. పుట్టినరోజు పెళ్ళిరోజు, ఇతరత్ర కార్యక్రమా లకు పేదలకు ఒక్కపూట అన్న దానం చేయాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్ట్ నం బరు 9246939388కు సంప్ర దించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.నేటి కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ మహమ్మద్ అబ్దుల్ రఫీక్ పొలాస రాజేందర్ సగ్గు రాహుల్ పసుల శ్రీధర్ పొలాస భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



# గాయత్రి కళాశాలలో టీబీపై అవగాహన

## - ఎన్ఎస్ఎస్ ఫార్మేషన్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:**

పెద్దపల్లి జిల్లా గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఫార్మేషన్ డే సందర్భంగా టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు, ముందస్తు పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.గతంలో టీబీ మందులు వాడిన వారు, వారి కుటుంబ సభ్యులు, 60 ఏళ్లు పైబడిన వారు, తక్కువ బరువు ఉన్నవారు, మద్యం, సిగరెట్, బీడీ, పొగాకు వినియోగించేవారు, 15 రోజులకు మించి దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా ఎక్స్‌రే, కఫం పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ చికిత్స పర్యవేక్షకులు దేవ తిరుపతి సూచించారు. టీబీ రహిత రాష్ట్రంగా నిలపడమే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు భాగస్వాములు కావాలని అన్నారు.



## కోనేరుపల్లి, కాట్నపల్లిలో శ్రమదానం

**చొప్పదండి, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**

స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా చొప్పదండి మండలం కోనేరుపల్లి, కాట్నపల్లి గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజల భాగ స్వామ్యంతోనే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం సాధ్యం అవుతుందని, గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన జలసిరి పనులు చేపట్టి ఎల్నినో పరిస్థితుల నుండి బయట పడాలని కోరారు. ఎంపీడీవో వేణుగోపాలరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సర్పం చులు రాజు, శ్రీనివాసరెడ్డి, ఐకెపి ఎపిఎం వాణిశ్రీ, ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచితంగా గైడ్ల పంపిణీ

**చొప్పదండి, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**

చొప్పదండి మండలం ఆర్నకొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 2026 నేషనల్ మెయిన్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష రాస్తున్నందున యూత్ ఫర్ సేవా సంస్థ ఉచితంగా ఎన్.ఎం.ఎం.ఎస్ గైడ్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ వరంగల్ చాప్టర్, హనుమకొండ జిల్లా వడ్డేపల్లి హెచ్ఎం కందగట్ల సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని ఉన్నత రంగాలలో స్థిరపడాలని, వారి అభివృద్ధి కోసం యూత్ ఫర్ సేవా సంస్థ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. సేవా సంస్థకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యాయులు కానిగంటి రాజమౌళి, గంగాధర్, ప్రార్థన, అనిత, మీనాక్షి, కిషన్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



## గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హఠాన్మరణం

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 24(ప్రజాజ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొల్లిలింగం(70) గురువారం రోజు ఉదయం 7 గంటల ప్రాంతంలో స్నానం చేస్తూ ఉండగా గుండెపోటుకు గురయ్యాడు ప్రాణాలు అక్కడికక్కడనే వదిలేయడంతో హుటాహుటిన ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు ఆయన బి ఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ మొదటి ఎంపీటీసీగా గొల్లపల్లి గ్రామంలో గెలిసి ప్రజా సేవ చేశారు పలువురు సంతాపం వ్యక్తం చేశారు సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు జడ్పిటిసి సభ్యులు లక్ష్మణరావు తోట ఆగయ్య గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ డాక్టర్ ఆంజనేయులు జబ్బార్ బుగ్గ కృష్ణమూర్తి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు 20వేల రూపాయలు టిఆర్ఎస్ పార్టీ తరఫున అందజేశారు.



## బొప్పాపూర్ హై స్కూల్ లో మొక్కలు నాటిన సర్పంచ్

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండల రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గురువారం రోజు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పరిశుభ్రత పరిస్థితులను మధ్యాహ్న భోజన పరిశీలించారు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి మరియు వార్డ్ మెంబెర్స్ ప్రధానో పాధ్యా యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పోషణ్ మాహ్ 2026 లో భాగంగా క్విజ్ పోటీలు పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహనకు ప్రాధాన్యం

**కోనరావుపేట,సెప్టెంబర్.24 (ప్రజాజ్యోతి)**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ్ మాహ్ 2026 కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామం, వార్డు స్థాయిలో సమాజ ఆధారిత క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు.ప్రజలకు పోషకాహారం ప్రాముఖ్యత, పిల్లల ఆరోగ్యం, శిశు సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోషకాహార లోపం వల్ల కలిగే అనర్థాలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన సమతుల ఆహారం, పరిశుభ్రత అలవాట్లపై ప్రశ్నలు రూపొందించ నున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగా లక్ష్మి,అంగన్వాడి టీచర్ పద్మ,ఆయమ్మ లక్ష్మీ, గర్భవతులు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.



## వేములవాడ ప్రభుత్వ జూనియర్,కళాశాలలో ఘనంగా ఎన్.ఎస్.ఎస్.దినోత్సవం

**వేములవాడ,సెప్టెంబర్,24:ప్రజాజ్యోతి.**

గురువారంరోజునవేములవాడప్రభుత్వజూనియర్,కళాశాలలోఎన్.ఎస్ .ఎస్.ఆవిర్భావదినోత్సవాన్నీ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ఇం చార్జ్ ప్రిన్సిపాల్ అర్.శేఖర్ మా ట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థు లు, సేవాభావం అలవార్చు కో వాలని కోరారు.ఎన్.ఎస్. ఎస్. 1969 లో ప్రారంభమైందని తె లియజేశారు. ఎన్.ఎస్.ఎస్.నినాదం నాట్. మీ.బట్ యు . అని తెలియజే శారు. అదేవిధంగా ఎన్. ఎస్. ఎస్. కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికె ట్స్ ప్రధానం చేయడంజరిగింది. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ఆఫీసర్ రవీందర్,నుఘనంగాసన్మానించారు. ఈ కార య్రక్రమంలో కళాశాల వి ద్యార్థిని. విద్యార్థులు అధ్యాప క. అధ్యా పకేతారా సిబ్బంది పా ల్గొన్నారు.



## హత్యకు గురైన వివాహిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం.

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి).**

గత నెల పదిర గ్రామంలో జరిగిన విషాద ఘటనలో హత్యకు గురైన వివాహిత కుటుంబానికి పదిర గ్రామ సర్పంచ్ శ్రీమతి బోనాల మణెమ్మ తరఫున రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మృతురాలికి ముగ్గురు చిన్నారులు ఉండటంతో వారి విద్యా అవసరాలకు కొంతమేర అండగా నిలిచేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని చిన్నారుల చదువుకు సహాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బోనాల సాయికుమార్, బీజేపీ మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి, గోపన్నగారి కొమురయ్య, పద్మారెడ్డి, నర్సింలు, పిట్ల శృతి ఎల్లం, పరశురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: - ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి

**ఎల్లారెడ్డిపేట ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 24:**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు జాతీయ సేవా పథకం ప్రాధాన్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, సహకార భావనను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజ సమస్యలను అర్థం చేసుకోవడంతో పాటు ఇతరులకు సేవ చేయాలనే దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు.

**పుస్తక పఠనంతో జ్ఞానం పెంపొందుతుంది**

కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరగడంతో పాటు భాషా నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనా శక్తి, విషయ పరిజ్ఞానం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞాన, సాహిత్య, చరిత్ర, జనరల్ నాలెడ్జ్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కూడా చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయం విద్యార్థుల జ్ఞానాన్ని విస్తరించే వేదికగా నిలుస్తుందని, ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని అన్నారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అది దోహదపడుతుందని పేర్కొన్నారు.

**ఉత్తమ పౌరులుగా ఎదగాలి**

విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ప్రిన్సిపాల్ సూచించారు. విద్యార్థి దశలోనే సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను



పెంపొందించుకుంటే భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పరశురాములు, అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, జ్యాతోతు శ్రీనివాస్, గజ్జెల గంగాధర్, అనుముల రవిచంద్ర, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

# పల్లిమక్తలో భూ భారతి భూ రీసర్వేపై అవగాహన సదస్సు

## గ్రామ సభలో రైతులకు అధికారుల వివరణ.. సర్వేలో ప్రతి రైతు పాల్గొనాలి

**కోనరావుపేట,సెప్టెంబర్.24 (ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం భూ భారతి భూ రీసర్వే అంశాలపై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా ఆర్డీవో, ఎమ్మార్వో వరలక్ష్మి,అడిషనల్ సర్వేయర్ ,హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు భూ భారతి చట్టం, భూ రీసర్వే ప్రక్రియ, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై వివరంగా అవగాహన కల్పించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ రీసర్వేలో పాల్గొని తమ ఆధీనంలో ఉన్న భూముల వివరాలను సర్వే అధికారులకు అందించాలని కోరారు. సర్వే పూర్తయితే భూ రికార్డుల్లో స్పష్టత వచ్చి భవిష్యత్తులో భూ వివాదాలకు తావుండదని వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ భూ సమస్యలు, సందేహాలను అధికారుల దృష్టికి తీసుకురాగా, అధికారులు వాటికి అవసరమైన సూచనలు, వివరణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి,వార్డు సభ్యులు జాగిరి కిరణ్ గౌడ్, చిద్రవేణి నరేష్,జాగిరి లక్ష్మీ, రేగుల పద్మ





పరిశరములు,జిన్నా సమత అర్జున్,సింగిల్ విండో డైరెక్టర్,చిద్రవేణి సరిత ప్రభాకర్, మండల సర్వేయర్, జీపీవో కనకయ్య, గ్రామ స్థాయి ఉద్యోగులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

# రాములపల్లిలో భారీ ధర పలికిన గణేష్ లడ్డూ

**ఎలిగేడు సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి:**

రాములపల్లి గ్రామంలో మల్లికార్జున యువ యాదవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటకు భారీ స్పందన లభించింది. ఎలిగేడు మండలంలోని ఎక్కడ లేని విధంగా రాములపల్లి గ్రామంలో లడ్డు వేలంలో పోటీ పడుతూ ఈరోజు వేలంపాటలో గణేష్ లడ్డూకు లక్ష రూపాయలకు పైగా ధర పలికింది. ఇదే మండపంలో గత పదేళ్లుగా పోటీ పడుతున్న లడ్డును దక్కించుకోవడానికి జరిగిన లడ్డూ వేలంపాటలతో పోలిస్తే ఈ ఏడాది అత్యధిక ధర పలకడం విశేషంగా నిలిచింది. గణేశుడి లడ్డూను దక్కించుకుని ప్రసాదంగా స్వీకరిస్తే దేవుని ఆశీస్సులతో కుటుంబంలో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని గ్రామస్తుల విశ్వాసం. ఈ నమ్మకంతోనే ప్రతి సంవత్సరం లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనంత భారీ ధర పలకడంతో రాములపల్లి గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గణనాథుని ఆశీస్సులతో గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.



# వాన నీటిలో మునిగిన కనగర్తి బడి

**కోనరావుపేట,సెప్టెంబర్.25 (ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పూర్తిగా నీట మునిగింది.రాత్రి కురిసిన కుండపోత వర్షంతో పాఠశాల ఆవరణమంతా నీరు చేరి చెరువును తలపించింది. గురువారం ఉదయం పాఠశాలకు చేరుకున్న చిన్నారులు, ఉపాధ్యాయులు నీటిని దాటుకుంటూ తరగతి గదుల్లోకి వెళ్లాల్సి వచ్చింది. పుస్తకాల సంచులు తడుస్తూ, బట్టలు మురికవుతుండటంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు.ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటోందని, పాఠశాల చుట్టూ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే కారణమని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వ వల్ల దోమలు పెరిగి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, చిన్నారుల ఆరోగ్యం, భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాఠశాలను సందర్శించి శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# చిన్న కొల్వాయిలో ఘనంగా 'పోషణ్ మాసం' వేడుకలు

**బీర్ పూర్, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**

బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ మాసం' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. సువర్ణ ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారమే ప్రాణాధారమని పేర్కొన్నారు. పిల్లలకు ప్రతిరోజూ ప్రోటీన్లు, విటమిన్లు సమృద్ధిగా లభించే ఆకుకూరలు, పప్పులు, సీజనల్ పండ్లతో పాటు 6 నెలల నుండి 3 సంవత్సరాల లోపు పిల్లలకు క్రమం తప్పకుండా బాలామృతం తినిపించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేసి, అనంతరం పోషకాహార ప్రాధాన్యతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ బి. గంగవ్వ, పంచాయతీ కార్యదర్శి నారాయణ, హెచ్.ఎమ్ ప్రశాంత్, అంగన్వాడీ టీచర్ యశోద, స్థానిక తల్లులు, కిశోర బాలికలు మరియు చిన్నారులు పాల్గొన్నారు.





# జిల్లాలో ఆధార్ సేవలు మరింత పారదర్శకంగా అందించాలి – జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### - పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### - జిల్లా స్థాయి ఆధార్ మానిటర్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి;**

జిల్లాలో ఆధార్ సేవలు మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా అందేలా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటర్ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తో కలిసి నిర్వహించారు. జిల్లాలో ఆధార్ నూతన నమోదులు , మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ల పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,, ఆధార్ సేవలకు సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించాలని, స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన నూతన నమోదులు ఎన్ని, ఇంకా ఏయే ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్నాయి అనే వివరాలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్లు పూర్తి చేయడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ అప్‌డేట్లు, నూతన నమోదులను వేగవంతం చేయడానికి తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు.ఈ ప్రక్రియలో వివిధ శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోస్టల్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను



సాధించాలని ఆదేశించారు.సరిగ్గా డేటా సేకరణ చేయని కేంద్రాలు, నిర్లక్ష్యం వహించే ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట డేటా కలెక్షన్ రద్దు చేయడం వంటి కఠిన నిర్ణయాలు ఉంటాయని, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియను ముమ్మరం చేయాలని, బయోమెట్రిక్ సమర్పణ,సరైన డేటాను ఎప్పటికప్పుడు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. డేటాను సక్రమంగా సమర్పించని, నిబంధనలు పాటించని వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని, సంబంధిత శాఖల అధికారులు, పోస్టల్ శాఖ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఆధార్ సేవల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ రత్నాకర్, ఈ డి యం. కవిత, సంబంధిత, జిల్లా అధికారులు, పోస్టల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రుద్రవరం సింగిల్ విండో చైర్మన్‌గా పిల్లి కనకయ్య బాధ్యతల స్వీకరణ

### విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి: పిల్లి కనకయ్య






**వేములవాడ,సెప్టెంబర్,24:ప్రజాజ్యోతి.**

వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) నూతన చైర్మన్‌గా పిల్లి కనకయ్యతో పాటు 11 మంది డైరెక్టర్లు గురువారం నాడు పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందా రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై, నూతన చైర్మన్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతల స్వీకరణ అనంతరం నూతన ప్యాక్స్ చైర్మన్ పిల్లి కనకయ్య మాట్లాడుతూ... స్థానిక రైతాంగానికి ఏ కష్టం వచ్చినా తాను ఎల్లవేళలా ముందు వరుసలో ఉండి అండగా ఉంటానని స్పష్టం చేశారు. "వ్యవసాయమే అధారంగా జీవిస్తున్న రైతన్నల సమస్యలను పరిష్కరించడమే నా మొదటి ప్రాధాన్యత అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత, ఇతర ఎరువులు, విత్తనాల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం అన్నారు. ఏ ఒక్క రైతుకు కూడా విత్తనాలు, ఎరువుల విషయంలో ఇబ్బంది కలగకుండా సొసైటీ ద్వారా సకాలంలో అందిస్తామని, రైతుల సంక్షేమానికి, సింగిల్ విండో అభివృద్ధికి పాలకవర్గ సభ్యులందరినీ కలుపుకొని నిరంతరం శ్రమిస్తాను" అని ఆయన వెల్లడించారు. రైతు సేవే లక్ష్యంగా పని చేస్తానని, తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించి, ఈ పదవికి అవకాశం కల్పించిన స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆయన ప్రత్యేకంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తన పదవీ కాలంలో సొసైటీ ద్వారా లభించే అన్ని రకాల ప్రభుత్వ పతకాలను అర్హులైన రైతులందరికీ అందేలా పారదర్శకంగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సొసైటీ పరిధిలోని పలువురు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పిల్లి కనకయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

# సిరిసిల్ల సభను విజయవంతం చేయాలి

## - అభివృద్ధి పనులు, రాజన్న ఆలయ విస్తరణపై ప్రజలకు వాస్తవాలు వివరించాలి

## - ఎమ్మెల్యే పదవిని గెలిచిన రోజే ప్రజలకు అంకితం చేశా

## - నాలుగు సార్లు ఓడిన ప్రజల మధ్యే ఉన్న విదేశాలకు పట్నం పారిపోలేదు

## - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్







**వేములవాడ,సెప్టెంబర్,24:ప్రజాజ్యోతి.**

గురువారం రోజున వేములవా డ పట్టణంలో వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో దిశ నిర్దేశం చేశారు..వారు మాట్లాడుతూ గ్రామాల వారీగా బాధ్యతలు తీసుకున్న నాయకులు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి జన సమీకరణ చేపట్టాలని, నిర్ణయించిన సంఖ్యకు అదనంగా మరో పది మంది వచ్చేలా చూడాలని సూచించారు. జన సమీకరణపై మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కమిటీ కూడా సమీక్షించే అవకాశం ఉందని తెలిపారు..రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే సుమారు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తాజాగా మరో సుమారు రూ.250 కోట్లకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సిరిసిల్లకు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరయ్యాయని చెప్పారు. కోనరావుపేటకు కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైనట్లు వివరించారు.ఇవన్నీ ఇప్పటికే కొనసాగుతున్న రూ.1,000 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు అదనమని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయానికి రూ.99.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రానున్న కాలంలో జిల్లాకు మరో రూ.400500 కోట్ల మేర అదనపు అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఫోటోలు, ఆధారాలతో ప్రజలకు వివరించి, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారానికి వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు.వేములవాడ నిర్మాణం చేసుకొని ఇటీవల ప్రారంభం చేసుకున్న బండ్ పార్క్ పై గతంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పోలుస్తూ సోషల్ మీడియాలో కొందరు పోస్టులు చేస్తున్నారని తెలిపారు.ఇలాంటి ప్రచారంపై వెంటనే వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో వేములవాడ రాజన్న ఆలయం ఎలా ఉందో, 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ఆలయ అభివృద్ధి ఎంతవరకు జరిగిందో ప్రజలు గమనించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు.పాత ఆలయ నిర్మాణాన్ని, రాతితో నిర్మించిన మండపాన్ని ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథంగా ఉంచుతున్నామని స్పష్టం చేశారు. ఆలయ విస్తరణలో భాగంగా చుట్టుపక్కల ప్రాంతంలో అద్దాల మండపాలు, పిల్లర్లపై నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. పాత ఆలయాన్ని తొలగించడం లేదా మార్చడం లేదని తెలిపారు.1975 వరకు ఆలయ శిఖరం శిలామయంగా ఉండేదని, ఆ తర్వాత ఇటుకతో నిర్మాణం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా శిలామయంగా శిఖరాన్ని నిర్మించే అవకాశం ఉందని, ఆగమ శాస్త్రం ప్రకారం సంబంధిత అనుమతులు తీసుకుని ముందుకు వెళ్తున్నామని వివరించారు.ఆలయ నిర్మాణం, విస్తరణ విషయంలో భక్తులు, ప్రజలకు ఎలాంటి అపోహలు కలగకుండా వాస్తవాలను వివరించాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు.రాజన్న ఆలయానికి సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారాన్ని వెంటనే పరిశీలించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. రాత్రి వేళల్లో కూడా సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన కొన్ని పోస్టులను పరిశీలించి, అదే సమయంలో వాస్తవ పరిస్థితులను వివరిస్తూ స్పందించినట్లు తెలిపారు.రాజన్న ఆలయ అభివృద్ధి విషయంలో భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, వాస్తవాలను ప్రజలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు.గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు.ప్రజల మధ్య ఉండకుండా, ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేసే విధానానికి భిన్నంగా తాము ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని అన్నారు. తాను నాలుగుసార్లు ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజాక్షేత్రాన్ని వీడలేదని, ప్రజల మధ్యే ఉంటూ చివరకు ఎమ్మెల్యేగా గెలిచానని పేర్కొన్నారు.ఎమ్మెల్యే పదవిని కేవలం హోదాగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావించి పనిచేస్తున్నామని తెలిపారు. పదవిని ఎలా ఉపయోగించుకున్నారన్న విషయంలో తమకు, గత పాలకులకు తేడా ఉందని అన్నారు.రాజన్న ఆలయానికి సంబంధించిన అంశంలో బీఆర్ఎస్ నాయకులు, వారి నాయకత్వం గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. రాజన్నతో చెలగాటం ఆడితే ప్రజలు కూడా తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు.2023 డిసెంబర్ 3న జరిగిన ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పాలనపై తమ నిర్ణయాన్ని వెల్లడించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని, రాబోయే కాలంలో కూడా ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పాలన కొనసాగుతుందని తెలిపారు.సిరిసిల్లలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను కేవలం రాజకీయ సభగా కాకుండా జిల్లాలోని ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఉపయోగించుకోవాలని నాయకులు అన్నారు. జిల్లాకు అవసరమైన మరిన్ని నిధులు, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు.అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రతిపక్షాల్లో అసంతృప్తి కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు.సిరిసిల్లలో జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి భారీ సభ, ర్యాలీని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని, తాము ఇచ్చిన మాట ప్రకారం పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించాలని పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేయడానికి అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు..

# ఖిలావనపర్తిలో వికసిత్ భారత్ జీ రామ్ జీ పై గ్రామసభ




**ధర్మారం, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):**

ఖిలావనపర్తి గ్రామంలో సర్పంచ్ మోతె కనకయ్య ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌జీ రామ్ జీ పథకంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ హాజరై పథకం కింద చేపట్టనున్న 375 పనులపై వివరించారు. ప్రజలు, రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. అక్టోబర్ 2న జరిగే గ్రామసభకు అధిక సంఖ్యలో హాజరై పనులపై సూచనలు ఇవ్వాలని, ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మారుతి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి

శుక్రవారం 25 సెప్టెంబర్ 2026

# సిరిసిల్లకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ - రూ.200 కోట్ల నిధుల మంజూరుపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**ముస్తాబాద్: సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**



సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజ్జెల రాజు ఆధ్వర్యంలో ముస్తాబాద్ రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ ఘనంగా సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మకమైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడం విద్యారంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.స్కూల్ భవన నిర్మాణానికి రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయడంలో కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రంజాన్ నరేష్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు మిరుదొడ్డి భాను, ఉప సర్పంచ్ తాళ్ల విజయ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యారటి కర్ణాకర్, బీసీ సెల్ శీల ప్రశాంత్, ఎస్టీ సెల్ గోవర్ధన్ నాయక్, సీనియర్ నాయకులు ఉచ్చిడీ బాల్ రెడ్డి, వేముల సత్యం, ఆగుల్ల రాజేశం, మామిండ్ల ఆంజనేయులు, మున్యా నాయక్, బండారి సాయి, బండి శ్రీకాంత్, సద్ది మధు, మొర్రాయిపల్లి శంకర్, బాలసాని శ్రీనివాస్, రాజలింగం, తలారి నర్సయ్య, పయాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయు డు వెంకటేష్ కు ఘన సన్మానం

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న. వెంకటేష్ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈయనను ఊషన్న పల్లె పాఠశాలలో గురువారం రోజున. ఉపాధ్యాయ బృందం శాల్వాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ ఈర్ల సమ్మయ్య. ఉపాధ్యాయులు అమృత. సురేష్ కుమార్. మంద శ్రీవాణి .ఎడ్ల స్రవంతి. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పీజీలో సత్తా చాటిన గాలిపల్లి బిడ్డ

## జాతీయ స్థాయిలో 11 వేల ర్యాంక్ సాధించిన డాక్టర్

## కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి

**ఇల్లంతకుంట సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి)**

గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఓ యువ వైద్యురాలు నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో సత్తా చాటి గ్రామానికి, గర్వకారణంగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామానికి చెందిన పీసు ఎల్లారెడ్డిసుజాత దంపతుల రెండవ కుమార్తె శిరీష రెడ్డి నీట్ పీజీలో 11 వేల ర్యాంక్ సాధించి ప్రతిభను చాటారు.చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకున్న ఆమె వైద్య విద్యను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగారు. ప్రతిష్టాత్మకమైన కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసి, పీజీ వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పీజీ పరీక్షకు హాజరయ్యారు. కఠోర శ్రమ, పట్టుదలతో చదివి జాతీయ స్థాయిలో 11 వేల ర్యాంక్‌ను సాధించారు.వైద్య విద్యలో మరో కీలకమైన అడుగు వేయడానికి సిద్ధమైన ఆమె విజయంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాలిపల్లి గ్రామానికి చెందిన యువతి వైద్య రంగంలో నీట్ పీజీలో మంచి ర్యాంక్ సాధించడం పట్ల గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.



# ప్రభుత్వ భూములు స్వాధీనం చేసి పేదలకు పంచుతాం

## - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మారం, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):**

బీఆర్ఎస్ నేతల ఫామ్‌హౌస్‌లలో ప్రభుత్వ భూములు ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటారా అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిరారు. గురువారం ధర్మారంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితరుల ఆధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఉన్నట్లు ఆధారాలతో తేలితే చట్టప్రకారం స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు ధర్నా చేసిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ధర్మారం మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమంగా ఉన్న భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 676పై విచారణ కొనసాగుతోందన్నారు. జక్కన్నపల్లి, ఎమ్మార్వో కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ భూములను లేఅవుట్ చేసి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు.ఎర్రగుంటపల్లిలో ఏటీసీ (ఐటీఐ) నిర్మాణ పనులను రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ వివేక్ చేతుల మీదుగా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ధర్మారం మండల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు.సమావేశంలో తాసిల్దర్ దురిశెట్టి శ్రీనివాస్, ఎంపీడీవో వేముల సుమలత,డిసిసిబి ప్రధాన కార్యదర్శి గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కార్యదర్శి కొత్త నరసింహులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రూప్ల నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంజిత్, నాయకులు కాడే సూర్యనారాయణ, ధ్యాగేటి ఉదయ్ వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఈనెల 26న.మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

## - ఎంపీడీవో సురేందర్ కుమార్

**కాల్వ శ్రీరాంపూర్. సెప్టెంబర్ 24. (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని. మండల పరిషత్ సమావేశ మందిరంలో. ఈనెల 26 శనివారం రోజున. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి సురేందర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు .సర్పంచులు తదితరులు హాజరుకావాలని ఆయన సూచించారు.



# ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు

## రూ. 25,116 పలికిన లడ్డూ

**మల్లాపూర్: సెప్టెంబర్ 24 ప్రజాజ్యోతి**

స్థానిక వాసవి మాత ఆలయంలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గణనాథుని లడ్డు ప్రసాదం వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేలంలో మొగిలిపేట గ్రామానికి చెందిన ర్యాగల్ల వెంకటేశ్వర్ గౌతమి దంపతులు రూ. 25,116 పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం వైశ్య సంఘం సభ్యులు సాంప్రదాయ పద్ధతిలో కోలాటం ఆడుతూ నిమజ్జన శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో సంఘ నాయకులు, సభ్యులు తమ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



# ఆంక్షలు ప్రకటనకేనా.. అమలు ఏదీ..?

## బైండోవర్ చేసినా.. మోగిన డీజేలు

## డీజే శబ్దాలపై పర్యవేక్షణ ఏదీ ?






**చిగురు మామిడి/సెప్టెంబర్ 24. ప్రజా జ్యోతి,**

వినాయక చవితి, నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినా.. డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై విధించిన ఆంక్షలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలయ్యాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కరీంనగర్ జిల్లా సీపీ గౌస్ఆలం ఆదేశాల మేరకు చిగురుమామిడి మండలంలోని 14 మంది డీజే ఆపరేటర్లను ఎస్సై జగదీశ్వర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అయితే నిమజ్జన వేడుకల సందర్భంగా పలు గ్రామాల్లో పరిమితులకు మించి డీజే శబ్దాలు వినిపించడంతో ఆంక్షల అమలుపై చర్చ మొదలైంది. అధిక శబ్దాలతో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు స్థానికులు తెలిపారు. ముందస్తుగా డీజే నిర్వాహకులను బైండోవర్ చేసినప్పటికీ.. నిబంధనల అమలును అధికారులు ఎంతవరకు పర్యవేక్షించారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**పర్యవేక్షణ ఏదీ?**

ఆంక్షలు విధించడం, డీజే నిర్వాహకులను బైండోవర్ చేయడంతోనే బాధ్యత ముగిసిపోదని స్థానికులు పేర్కొంటున్నారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో శబ్ద పరిమితులను పర్యవేక్షించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ఆంక్షలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బీర్‌పూర్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

- విద్యార్థినులతో ముఖాముఖి; విద్యాబోధన, భోజన వసతులపై ఆరా
- మెరుగైన వసతుల కోసం ప్రత్యామ్నాయ భవన పరిశీలనకు ఆదేశం





**బీర్ పూర్, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, హాస్టల్ వసతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ ప్రకారం అందుతున్న భోజనం, విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం ప్రతిరోజూ పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత భవనంలో ఉన్న అసౌకర్యాల దృష్ట్యా, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదిత ఎంపీపీఎస్ డీపీఈపీ పాఠశాల భవనాన్ని పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక ఆర్‌డీఓ ప్రత్యామ్నాయ భవనాన్ని, అక్కడ ఉన్న వసతులను క్షుణ్ణంగా పరిశీలించి, కేజీబీవీ మార్పిడిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. మెరుగైన ఫలితాల సాధనకై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ, కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత, సత్యనారాయణ, తహశీల్దార్ సుజాత, ఎంఈఓ నాగభూషణం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మండల మైనార్టీ కమిటీ నూతన అధ్యక్షుడిగా మహమ్మద్ అమీన్ - ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ

**మల్లాపూర్: సెప్టెంబర్ 24 ప్రజాజ్యోతి**

మండల కేంద్రంలో గురువారం మండల మైనార్టీ నూతన కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని మైనార్టీ సభ్యులు, పెద్దలు హాజరై, సభ్యులందరి ఏకాభిప్రాయంతో రాబోయే రెండేళ్ల కాలపరిమితికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అమీన్, ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీ ఫ్లిప్ కార్ట్, గౌరవాధ్యక్షుడు ఎం.డి. రఫీ, జనరల్ సెక్రటరీ మహమ్మద్ సల్మాన్, క్యాషియర్ మహమ్మద్ అంకుష్, కార్యదర్శి షేక్ ఇమామ్, గౌరవ సలహాదారులు మహమ్మద్ రఫీ, మహమ్మద్ మహబూబ్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఖాజా, మహమ్మద్ అల్లా బకాష్, మహమ్మద్ బాసు భాయ్, మహమ్మద్ సదుల్లా, మహమ్మద్ సదుల్లా ఈ నూతన కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని సభ్యులు



తెలిపారు. మైనార్టీ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మైనార్టీ సోదరులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరినీ కలుపుకుపోతూ మైనార్టీల ఐక్యత, సంక్షేమం కోసం కమిటీ సభ్యులతో కలిసి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# కొలనూరు సింగిల్ విండో డైరెక్టర్‌గా సుంకరి రెడ్డి ఘనంగా సన్మానించిన కుటుంబ సభ్యులు,

**కోనరావుపేట,సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి)**

కొలనూరు సహకార సంఘం సింగిల్ విండో డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన సుంకరి రెడ్డి, కుటుంబ సభ్యులు, గురువారం ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేశారు. రైతుల సంక్షేమం కోసం, సహకార సంఘం అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో సమర్థవంతంగా పనిచేసి రైతులకు అండగా నిలవాలని పలువురు సూచించారు.



# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి లక్ష్మణ్‌కుమార్

**ఎండపల్లి, సెప్టెంబరు 24, ప్రజాజ్యోతి:**

వినాయక నిమజ్జనం సందర్భంగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కొప్పుల రాజశేఖర్ కుటుంబాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం పరామర్శించారు. కొత్తపేటలో రాజశేఖర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి వెంట స్థానిక సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి పిసిసి కార్యవర్గ సభ్యులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి,,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు శేఖర్,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ధర్మారంలో శ్రీ గణేష్ సేవా యూత్ ఆధ్వర్యంలో 101 దీపారాధన భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు, గ్రామస్తులు

**కోనరావుపేట, సెప్టెంబర్.25 (ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో శ్రీ గణేష్ సేవా యూత్ ఆధ్వర్యంలో 101 దీపారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బస్టాండ్ వినాయక మండపం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని 101 ప్రమిదలతో దీపారాధన చేశారు. దీపాల వెలుగులతో ఆలయ మండపం కనువిందుగా మారింది. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు.గ్రామ శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాల కోసం ఈ దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యూత్ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ సేవా యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సింగిల్ విండో చైర్మన్‌ను సన్మానించిన వైశ్య సోదరులు

**కోనరావుపేట,సెప్టెంబర్.24 (ప్రజాజ్యోతి)**

నూతనంగా ఎన్నికైన కొనరావుపేట సింగిల్ విండో చైర్మన్ చేపూరి గంగాధర్ గుప్తా, ను కోనరావుపేట మండలానికి చెందిన వైశ్య సోదరులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.రైతుల సంక్షేమం కోసం, సహకార సంఘం అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన పాలకవర్గం రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని వైశ్య ప్రముఖులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు, మర్యాల కిషన్ గుప్తా, కొండ వైకుంఠం గుప్తా,కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి పోకల అశోక్ గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.



# జగిత్యాల జిల్లాస్థాయి క్రీడా పోటీలకు రామాజీపేట విద్యార్థిని విద్యార్థులు ఎంపిక

**రాయికల్, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాజీపేట విద్యార్థిని విద్యార్థులు ఈనెల 26 నుండి జిల్లా స్థాయిలో జరిగే కబడ్డీ వాలీబాల్ ఖోఖో అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టుగా ప్రధానోపాధ్యాయులు గజ్జెల నరేందర్ వ్యాయామ ఉపా ధ్యాయుడు ప్రతాప్ రెడ్డి తెలిపారు క్రీడా కారులను అభినందించిన గ్రామ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ విజయ్ కుమార్ కిరణ్ వర్మ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లీపూర్ లో విద్యుత్ సిబ్బందిపై దాడికి యత్నం చేసిన వ్యక్తిపై పోలీస్టేషన్ లో ఫిర్యాదు

**రాయికల్ సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**

రాయికల్ మండలం అల్లీపూర్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎల్ఎం ఎం. గంగారాజుపై దాడికి యత్నించిన అల్లీపూర్‌కు చెందిన ఓ వ్యక్తిపై విద్యుత్ శాఖ సిబ్బంది రాయికల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఈ ఓపీ రాయికల్ నవీన్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది రాయికల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ కి సంబంధిత వ్యక్తిపై ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ నవీన్ మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బందికి ఆటంకం కలిగించడం, విధులకు అడ్డుపడటం లేదా వారిపై దాడికి యత్నించడం వంటి చర్యలను సహించబోమని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు విద్యుత్ సేవలు అందించడంలో సిబ్బంది చేస్తున్న కృషిని గుర్తించి, విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ ఉద్యోగులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి ?

**ఎండపల్లి, సెప్టెంబరు 24, ప్రజా జ్యోతి**

వినాయక నిమజ్జనం సందర్భంగా విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందిన ఘటన ఎండపల్లి మండలం కొత్తపేటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై పి ఉదయ్ కుమార్ కథనం మేరకు కొత్తపేట గ్రామానికి చెందిన కొప్పుల రాజశేఖర్ (23) స్పీకర్ బాక్సులకు ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌ను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుడి తల్లి నీల ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించడం జరిగింది,అని పోలీసులు తెలిపారు,



# ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలి

- ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు..

ప్రతి స్కూల్ కు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలి...

**రాయికల్, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**

ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులపై పెరుగుతున్న బోధన, బోధనేతర పనిభారాన్ని తగ్గించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయికల్ మండల ఎస్‌జీటీయూ శాఖ డిమాండ్ చేసింది. గురువారం నిర్వహించిన పాఠశాల సముదాయ శిక్షణ కార్యక్రమంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు తమ సమస్యలు, డిమాండ్లపై నినాదాలు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని వారు కోరారు. అలాగే ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టును కేటాయించి, పాఠశాలల పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులపై అదనపు పనిభారం పెంచుతున్న జీవో నంబర్ 25ను రద్దు చేయాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసే విధంగా వివిధ బోధనేతర పనులకు వినియోగించడాన్ని తగ్గించి, వారి ప్రధాన బాధ్యత అయిన విద్యాబోధనకు ఎక్కువ సమయం కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలంటే ముందుగా పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులను నియమించి, ఉపాధ్యాయులపై అనవసరమైన పనిభారాన్ని తగ్గించాలని ఎస్‌జీటీయూ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.

# పీఎం శ్రీ బీర్ పూర్ పాఠశాలలో ఐసీటీ కంప్యూటర్ల ప్రారంభం






**బీర్ పూర్, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**

బీర్ పూర్ పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద మంజూరైన 4 కంప్యూటర్లు, 8 హెడ్ సెట్లను గురువారం గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, మండల విద్యాధికారి సిరుప నాగభూషణం ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలమట్ల హరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా కార్పొరేట్ స్థాయి వసతులు, డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని కోరారు. ఎంఈఓ నాగభూషణం మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ లో భాగంగా తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టుల సామర్థ్యాలను పెంపొందించడానికి డిజిటల్ విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. హెచ్ఎం సుదర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు టైం టేబుల్ ప్రకారం కంప్యూటర్లు బోధించడానికి ఒక ప్రత్యేక ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్ (చిక్కుల శ్రీకాంత్) ను కూడా నియమించామని, దీని ద్వారా విద్యార్థులు డ్రాయింగ్, టైపింగ్ తో పాటు సబ్జెక్టు స్కిల్స్ సులభంగా నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎనుగంటి జితేందర్ గౌడ్, కాంప్లెక్స్ హెచ్ఎం చెరుకు శ్రీనివాస్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ సముద్రాల శ్రీలత, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు సుభాష్, ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి, బాణావత్ స్వరూప, ఐ సి టి ఇన్‌స్ట్రక్టర్ చిక్కుల శ్రీకాంత్, షేక్ రజియా, కందుకూరి లలిత, గంగిపల్లి మౌనిక, గంధం ప్రియ మరియు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు,

# పుష్కరాలకల్లా కోటిలింగాల రూపురేఖల మార్పు,

## ఫిబ్రవరి 2027లోగా ఆలయ పునర్నిర్మాణం, ఘాట్ల పనులు పూర్తి చేయాలి,

## పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్





**వెల్గటూర్, సెప్టెంబరు 24 ప్రజాజ్యోతి,**

గోదావరి పుష్కరాల నాటికి కోటిలింగాల క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. గురువారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాలలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పుష్కర ఘాట్లు, కోటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని ప్రధాన ఆలయాలను అభివృద్ధి చేయడంతోపాటు పుష్కర భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో పుష్కరాల అభివృద్ధి పనులకు ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా అదనంగా నిధులు కోరగా రూ.81 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.16.13 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. శంకుస్థాపన చేసిన పనులను 2027 ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి పనులన్నీ పూర్తిచేసి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. అనంతరం తల్లిదండ్రులు, వయోవృద్ధులు, దివ్యాంగుల వారోత్సవాల పోస్టర్‌ను మంత్రి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు,ఆలయ కమిటీ సభ్యులు, పలు గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

# విద్యతో వికాసం ఓపెన్ విద్యకు అవకాశం, టాస్ పోస్టర్ ఆవిష్కరించిన సర్పంచ్ మల్లేష్ గౌడ్,

**ఎండపల్లి, సెప్టెంబర్ 24,ప్రజా జ్యోతి**

చదువును మధ్యలో నిలిపివేసిన వారికి ఓపెన్ విద్య ద్వారా తిరిగి చదువుకునే అవకాశం ఉందని,విద్యతో వికాసం ,ఓపెన్ విద్యకు అవకాశం, కల్పిస్తుందని, మండలంలోని గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ అన్నారు. 20262027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలపై అవగాహన కల్పించేందుకు గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడో, నాలుగో తరగతులు చదివిన వారు ఓపెన్ టెన్త్, పదో తరగతి ఉత్తీర్ణులు ఓపెన్ ఇంటర్‌లో చేరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మునిందర్, కోఆర్డినేటర్ రవి, ఉపసర్పంచ్ పాలక వర్గ సభ్యులు కార్యదర్శి కొమురయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

